క్లుప్తంగా

నేడు పౌర్ణమి ధ్యానం

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో పౌర్ణమి ధ్యానం నిర్వహించనున్నట్లు రాచవీడు (రాయచోటి) పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ సభ్యుడు దేవకి సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5–30 నుంచి 8–30 వరకు, 9 నుంచి 12 గంటల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన పిరమిడ్ మాస్టర్ మధుసూధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కావున కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొనాలని కోరారు.

నేకనాపురంలో పారుశుధ్య పనులు



మట్టికుప్పలను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని నేకనాపురం గ్రామ పంచాయతీలో శనివారం పారుశుధ్య పనులు చేపట్టారు. అపరిశుభ్రంగా ఉన్న పలు వీధుల్లో చెత్తా చెదారాలను తొలగించారు. రహదారికి అడ్డంగా ఉన్న మట్టి కుప్పలను జేసీబీ యంత్రంతో తీసివేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామంలోకి వచ్చే గ్రీన్ అంబాసిడర్ వాహనంలో వేయాలని తెలిపారు. గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మతులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి మరమ్మతులు చేపడుతున్నట్లు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యాలయ స్లాబు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్లాబు దెబ్బతినడంతో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంత జీవనం వైపు పయనించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరూ రాజీ మార్గాన్ని అలవరుచుకొని ప్రశాంత జీవనం వైపు పయనించాలని జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తెలిపారు. పట్టణ శివారులోని కూచివారిపల్లిలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టాల ఆవశ్యకతను వివరించారు. ఈ సదస్సులో న్యాయవాదులు శ్రీనివాసులు, వి.నాగేశ్వరచౌదరి, కూచివారిపల్లి గ్రామ సచివాలయ సెక్రటరీలు, కోర్టు సిబ్బంది మధుసూధన్‌రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి తోడ్పాటు



మాట్లాడుతున్న చైర్మన్ విశ్వనాథరెడ్డి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని రకాల అభివృద్ధి చేస్తామని మార్కెట్ యార్డు చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి తెలియజేశారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో అదనపు గదులు ఏర్పాటు చేసి, కూరగాయల మార్కెట్ నెలకొల్పి ప్రజలకు మరింత అందుబాటులో ఉంచుతామన్నారు. పశువుల సంత విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డయ్య, ట్రేడర్స్ సుబ్బిరెడ్డి, అలీ, శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాపు యువసేన జిల్లా అధ్యక్షుడిగా విద్యాసాగర్

మదనపల్లె : జిల్లా కాపుయువసేన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పూల విద్యాసాగర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్జాశ్రీనివాసరావు శనివారం నియామకపత్రం అందజేశారు. జిల్లా పరిధిలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు.

పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పరిశ్రమ, గృహ నిర్మాణ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు పారిశ్రామిక అభివృద్ధి కూడా జరిగితే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా వెనకడుగు వేయకుండా ప్రభుత్వం పారిశ్రామికరంగ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో అనేక పారిశ్రామిక వాడలు వెలుస్తాయని తెలిపారు. పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికరంగ అభివృద్ధికి రాయితీలు క్రమం తప్పకుండా అందిస్తోందన్నారు. పారిశ్రామిక రాయితీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణాల వారికి ప్రోత్సాహకరంగా ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలపై అవగాహన పెంచుకుని యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజు, హౌసింగ్ డీఈ కుప్పుస్వామి, డిక్కీ చైర్మన్ శివశంకర్, డీఎల్‌డీఓ మూర్తి, పంచాయతీరాజ్ డీఈ బాల నరసింహులు, జెడ్పీటీసీ రత్నమ్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ట్రాన్స్‌కో ఏడీ బాలాజీ, ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సదస్సులో పాల్గొన్న అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కొరముట్ల

ఓబులవారిపల్లె : దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం గాదెల సచివాలయ పరిధి వెంకటాపురం పంచాయతీలోని నూకనపల్లి గ్రామంలో ఆయన, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి నాయకులు, అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలతోపాటు చెప్పని సంక్షేమ పథకాలు కూడా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలలో అమలు చేయడానికి వీలు కానటువంటి వంద హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. సంక్షేమ పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, దీంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. చంద్రబాబు నాయుడును, తోక పార్టీలను నమ్మే రోజులు పోయాయని, ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పాలన ప్రజలకు అందుతుందని, గ్రామ సచివాలయాలు ద్వారా ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. నూకనపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, ఓసీ కాలనీలలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించారు. ప్రజలకు ప్రభుత్వం ద్వారా ఇప్పటి వరకు అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రోడ్లు, విద్యుత్, గృహ, రెవెన్యూలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ విప్ కొరముట్ల దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. నూకనపల్లి గ్రామంలోని మసీదు రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రక్షణగోడకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రూ.3 లక్షల నిధులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, సర్పంచ్‌లు సుబ్బలక్ష్మీ, కృష్ణయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సుంకేశుల రఫీ, జిల్లా టూరిజం డైరెక్టర్ పి. సుధాకర్‌రాజు, యువ నాయకులు కొమ్మూరు నారాయణరెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, కొనదల అమర్నాథరెడ్డి, అష్రఫ్, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అమర్, తహసీల్దార్ పీర్‌మున్నీ, ఎంపీడీఓ విజయారావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

యాంటీ డ్రగ్స్‌పై ప్రచారం

చిన్నమండెం : యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ముఖ్య కూడళ్లు, పలు పాఠశాలల వద్ద ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) వల్ల విద్యార్థులు కానీ, ప్రజలు కానీ తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా యువత ఆకర్షితులవుతున్నారని, అలవాటు పడితే దుష్పరిణామాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన వివరించారు.

సీఎంపై విమర్శలు తగవు

సిద్దవటం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు తగవని వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లె రామక్రిష్టారెడ్డి అన్నారు. మండలంలోని జంగాపల్లెలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

విద్యా సంస్థలను ఆదుకోవాలి

రామాపురం : చిన్న ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దర్బార్ కోరారు. శనివారం మండల పరిధి గువ్వలచెరువులోని శ్రీ బాలాజీ విద్యానికేతన్ పాఠశాలలో వారు మాట్లాడారు. రెండు సార్లు కరోనాతో పాఠశాలల యాజమాన్యాలు జీవనోపాధిని కోల్పోయి ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. సమావేశంలో స్వరూప్ తేజ, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను వంద శాతం పెంచాలి



ప్రజా వేదిక నిర్వహిస్తున్న డ్వామా అధికారులు

సిద్దవటం : ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలను వంద శాతానికి పెంచాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణ్‌రెడ్డి అన్నారు. సిద్దవటంలోని బీసీ బాలుర వసతి గృహం ఆవరణలో శనివారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలి చెల్లింపు విషయంలో కంప్యూటర్ ఆపరేటర్లు సక్రమంగా నమోదు చేయాలన్నారు. అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం జరిగిందన్నారు. 2021–22లో ఉపాధి పనుల కోసం దాదాపు 7 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి, ఈ ప్రజావేదికలో సోషల్ ఆడిట్ వారు చదివి వినిపించడం జరిగిందన్నారు. పనులు చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని, కానీ ఎక్కడా అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, డ్వామా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ తిరుమలేష్, జేపీసీ సుధాకర్, పీఆర్ఏఈ సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంటు వేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, సర్పంచ్‌లు ఈశ్వర్‌రెడ్డి, జానకిరామయ్య, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సిద్దవటం : మండలంలోని మొదీన్‌సాబ్‌పల్లె గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెరువు పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణ్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు దెబ్బలు తగిలితే, ప్రథమ చికిత్స కోసం సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

తెలుగువారి పుణ్య ఫలం.. పోతన భాగవతం



పోతన చరిత్ర, శ్రీ కోదండ రామ శతకాలను ఆవిష్కరిస్తున్న సాహితీ ప్రియులు

ఒంటిమిట్ట : తెలుగువారి పుణ్యఫలం పోతన భాగవతం అని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. శనివారం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి క్షేత్రంలోని రంగమండపంలో హైదరాబాదుకు చెందిన కొడవర్తి సంధ్య రచించిన పోతన చరిత్ర, మామిళ్ళ లోకనాథం రచించిన శ్రీ కోదండ రామ శతకం గ్రంథాలను ఆవిష్కరించారు. ముందుగా రచయితలను పోతన సాహితీ పీఠం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ భగవతనుగ్రహంచే సిద్ధించిన కవిత్వాన్ని దైవానికి అర్పించడం మంచి సంప్రదాయం అన్నారు. గోడవర్తి సంధ్య, మామిళ్ళ లోకనాథం రచించిన పోతన చరిత్ర, శ్రీ కోదండ రామ శతకంలో సాహిత్యం, సరళ తత్వానికి పెద్దపీట వేశారన్నారు. పోతనకు, మహాకవయిత్రి మొల్లమాంబకు జీవన రేఖలు, కవితా విధానం, పద ప్రయోగాల్లో అనేక పోలికలు ఉన్నాయన్నారు. రామ భక్తురాలైన మొల్లమాంబ విగ్రహం ఇక్కడ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన సాధన సంస్థ అధ్యక్షుడు నరసింహాచార్య, సంధ్య, పోతన సాహితీ పీఠం అధ్యక్ష కార్యదర్శులు పసుపులేటి శంకర్, ముమ్మడి నారాయణరెడ్డి, పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, సతీష్, విశ్రాంత అధ్యాపకులు శేషారెడ్డి, కర్లపూడి కృష్ణ, మునీశ్వర్, ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం



హార్థిక్ కుమార్‌రెడ్డికి చెక్ అందజేస్తున్న ముక్కా సాయివికాష్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న విద్యార్థి హార్థిక్ కుమార్‌రెడ్డికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాష్‌రెడ్డి రూ. 50 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ముక్కా సాయివికాష్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి స్కేటింగ్‌కు ఎంపికైన హార్థిక్ కుమార్‌రెడ్డిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ రేవతి, ప్రధానోపాధ్యాయురాలు అనిత, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, రైల్వేబోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, తల్లెం చంద్రమోహన్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాసులురెడ్డి, కొలూరు సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

రామాపురం : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయితీ టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి ఆగి ఉన్న లారీని వెనుకవైపు నుంచి టీవీఎస్ ఎక్స్ఎల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టు దర్బార్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. రాయచోటి పట్టణానికి చెందిన దర్బార్‌బాషా టీవీఎస్ వాహనంలో రామాపురానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితుడిని 108లో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

■ మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురం సమీపంలో రెండు స్కూటర్లు ఢీకొనడంతో రామచంద్రయ్యకు తీవ్ర గాయాలైనట్లు మండల ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన రామచంద్రయ్య గువ్వలచెరువు నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా.. మార్గంమధ్యలోని కొత్తరోడ్డు నారాయణపురం సమీపానికి రాగానే వెనుక వైపు నుంచి రామాపురం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడిని 108లో రాయచోటి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

నేడు వాలీబాల్ టోర్నమెంట్

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 ఎస్‌కేఆర్ నగర్‌లో మాధవరం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ సాయి, ఇంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, అట్లూరు, బద్వేల్ మండలాల పరిధిలో జరుగుతాయని వారు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.15,000ని దాత సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, రెండవ బహుమతిని రూ.10,000 దాత ఏ.పి. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఐరగంరెడ్డి సుబ్బారెడ్డి, మూడవ బహుమతిని రూ.5,000 దాత మాధవరం–1 గ్రామ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డి అందజేస్తారని వివరించారు.

మాఘమాస ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

రైల్వేకోడూరు రూరల్ : రైల్వేకోడూరులోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మాఘమాస రెండవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పంద్రా నరసింహులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు గోవర్ధన్ రామ్‌సాయి పూజలు చేసి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు.

పెనగలూరు : పెనగలూరు వేణుగోపాలస్వామి పార్వేటస్థలంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితుడు చెంచుసుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మలు వెంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు.

చిన్నమండెం : దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లెలోని శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్ మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ముగ్దుం మొహియిద్దీన్ జీవితం.. ఆదర్శనీయం

నందలూరు(ఒంటిమిట్ట): ఎస్టీయూ వ్యవస్థాపకులు ముగ్దుం మొహియిద్దీన్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్స్ అశోక్, సన్నావుల్లా పేర్కొన్నారు. నందలూరులోని జిల్లా ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం ముగ్దుం మొహియిద్దీన్ జయంతి సందర్భంగా ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, అభ్యుదయ కవి, రచయిత, కమ్యూనిస్టు నేతగా సేవలు అందించారని తెలిపారు. ముగ్దుం మొహియిద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు లీలా క్రిష్ణయ్య, రాజంపేట రీజియన్ కో–కన్వీనర్ షఫీ ఉల్లా, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజద్ బాషా, శిబవతుల్లా, ప్రసాద్ పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

రామాపురం : బాధితురాలిని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పరామర్శించారు. రామాపురం ఎంపీపీ విజయలక్ష్మి తల్లి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటోంది. ఆమెను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు(ఒంటిమిట్ట) : ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. నందలూరు మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా బస్టాండ్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని కాలనీల్లో తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు అవసరం ఉండేదన్నారు. కానీ నేడు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే గ్రామ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు, కరెంటు తదితర సమస్యలను వారు తెలిపారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో పలు చోట్ల శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉష సుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్లె మాధవిరెడ్డి, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, తహసీల్దార్ ఉదయ శంకర్‌రాజు, మండల కో–ఆప్షన్ సభ్యులు కలీం, బీసీ నాయకులు హిమగిరి నాథ్ యాదవ్, తుమ్మల శ్రీధర్‌గౌడ్, దళిత నాయకుడు పెనుబాల నాగసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివిడి సుధాకర్, అరిగెల నాని, హార్మోగం విశ్వనాథ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



శ్రీ రామచంద్రుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో వెలసిన శ్రీ రామాంజనేయస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీ సీతారాములకు కల్యాణం నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం పునర్వసు కావడంతో 42 నెలలు (ప్రతి నెల పునర్వసు నక్షత్రం రోజున) పూజలలో భాగంగా శనివారం 11వ నెల సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, గణపతి పూజ, నవగ్రహ పూజ, లక్ష్మీ నారాయణ హోమాలు వేదపండితులు రాంప్రసాద్ శర్మ, ప్రభాకర్ శర్మ చేశారు. స్వామి వారికి కల్యాణం ఆలయ కమిటీ అధ్యక్షులు కేవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు బాలకుండ సుక్‌సాగర్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు కె.వెంకట సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, సుబ్బరామయ్య, కె. రాజశేఖర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సానిపాయి రెడ్డెయ్య, సాయిరాం, హరినాథరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు.. రైతుల గ్రంథాలయాలు



రైల్వేకోడూరు రూరల్ : మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ

రాజంపేట రూరల్ : జిల్లాలోని ఆర్‌బీకేలు రైతుల సందేహాలు, సమస్యలను నివృత్తి చేసి వారికి సూచనలిచ్చే గ్రంథాలయాలుగా ఉపయోగ పడుతున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. స్థానిక డివిజనల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీ ఏజీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం ఆర్‌బీకే ఉద్యోగులు, ఎంఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఆర్‌బీకేలలోని ఉద్యోగులు ఎలా విధులు నిర్వర్తించాలో వివరించారు. ఆర్‌బీకేల వారిగా రబీ ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీపై ఆరా తీశారు. రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయో లేదో ఆరా తీయడంతోపాటు ఎరువులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో వ్యవసాయ అధికారి మజ్జిద్, టెక్నికల్ ఏఓలు రమేష్, రమణతోపాటు రాజంపేట, నందలూరు, పెనగలూరు ఆర్‌బీకేల ఉద్యోగులు, ఎంఏఓలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేయాలి

రైల్వేకోడూరు రూరల్ : రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే ప్రతి వీఏఏ, గ్రామ ఉద్యాన సహాయకులు అంకిత భావంతో పని చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ అన్నారు. రైల్వేకోడూరు శ్రీ శక్తి భవనంలో వ్యవసాయ శాఖ ప్రగతిపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించి సాగు విస్తీర్ణం పెరిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు ఏడీఏ కవిత, జిల్లా వ్యవసాయ కార్యాలయం అధికారులు రమేష్ రాజు, వెంకట మోహన్, కోడూరు, చిట్వేలి, పుల్లంపేట ఏఓలు సుధాకర్, శ్రీకర్, కృష్ణ చైతన్య, సిబ్బంది హాజరయ్యారు.

జాబ్‌మేళాను విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : మదనపల్లె బీటీ కళాశాలలో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎంపీపీ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు వివిధ రాష్ట్రాల నుంచి 125 కంపెనీలు వస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఆపై విద్యార్హతగల నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9014528171, 9441776334 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.